క్లుప్తంగా

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపు సినీ సంగీత విభావరి

నగరంపాలెం: సినీ సంగీత విభావరి మంగళవారం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకగళంతో 58 చలన చిత్రాల గీతాలను జూలై 27న ఆలపించగా, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న సందర్భంగా అమరావతిరోడ్డు అన్నదాన సమాజంలో మంగళవారం సాయంత్రం అభినందన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలో పత్రి లలితబాబు, వై.హేమమాలినికి విశిష్ట పురస్కారాలు, ఆరుగురు పురస్కార గ్రహీతలను సత్కరించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆదివారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడికి చెందిన మక్కెన దివ్యతార, తన స్నేహితురాలైన చిలుకూరి అమల ఇద్దరూ శనివారం స్కూటీపై గుంటూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద స్కూటీ వెనుక వస్తున్న జీపు డ్రైవర్ స్కూటీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో నిర్లక్ష్యంగా, హారన్ కొట్టకుండా అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న దివ్య తార, అమలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న కాటూరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దివ్యతార ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.నాగేంద్ర తెలిపారు.

వ్యక్తిపై బ్లేడుతో దాడి



ప్రత్తిపాడు: మెడికల్ షాపునకు వెళుతున్న ఒక వ్యక్తిపై ఇద్దరు బ్లేడ్‌తో గాయపరిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగపురానికి చెందిన ఆరుమళ్ళ మోహన్ శనివారం అర్ధరాత్రి తన భార్యకు మందులు తీసుకురావడానికి గ్రామంలోని మెడికల్ షాపునకు వెళుతున్నాడు. అదే సమయంలో స్థానిక మర్రిచెట్టు సెంటర్ వద్ద ఉన్న కొండేపాటి ఏసుబాబు, కారుమూరి బాలస్వామి అడ్డగించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఈమధ్య ఎక్కువ చేస్తున్నావంటూ గొడవ పెట్టుకున్నారు. నిన్ను ఇక్కడికిక్కడే చంపుతామని మోహన్‌ను బెదిరించారు. దీంతో మాటామాటా పెరిగి బాలస్వామి, మోహన్‌ను వెనుక నుండి గట్టిగా పట్టుకోగా ఏసుబాబు బ్లేడుతో మోహన్ గొంతు కోసేందుకు ప్రయత్నం చేశాడు. గమనించిన మోహన్ ప్రతిఘటించి పక్కకు తప్పుకున్నా గొంతు కింద తెగి తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు మోహన్‌ను 108లో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆదివారం ఉదయం మోహన్ ప్రత్తిపాడు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేశారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఐనవోలు(తాడికొండ): తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లెస్ అధికారులు ఆదివారం తెలిపారు. ఐనవోలు గ్రామానికి చెందిన పులి వెలుగుల రాజు అక్రమంగా బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు ఐస్‌ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సీఎస్ డీటీ దేవరాజు, సీఎస్ సీనియర్ అసిస్టెంట్ అనీల్, సిబ్బంది పాల్గొన్నారు.

20న తెనాలిలో ధార్మిక శిక్షణ తరగతులు

జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి మండల కమిటీ సమావేశం ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధనస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహించారు. సంస్థ తెనాలి సబ్‌డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ తెనాలి సబ్‌డివిజన్ గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ రక్షణ కోసం గ్రామ ధార్మిక సమితుల సభ్యులకు అవగాహన కలిగించాలనే భావనతో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈనెల 12న రెండవ శనివారం సత్సంగం, 16 17 తేదీల్లో పౌర్ణమి హారతులు, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో మండల కన్వీనర్ దీపాల మహేష్, నగర కన్వీనర్ కోనపురెడ్డి బైరాగి, కొతరపు రామచంద్రరావు, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ఆదమరిస్తే.. అంతే..

- ఒంటరి వృద్ధులు, మహిళలే లక్ష్యం..
- మెడలోని బంగారు గొలుసులతో ఉడాయింపు
- ముఖాలకు కర్చీఫ్, మాస్కులు ధరించి దొంగతనాలు



'ఈమె గుడివాడ ద్రౌపది పాత గుంటూరులో నివసం ఉంటున్నారు. ఈనెల 3వ తేదీ కుమార్తె జ్యోత్స్నతో కలసి పాత గుంటూరు వైపు నడిచి వెళ్తున్నారు. మాట్లాడుకుంటున్న వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్రౌపది మెడలో బంగారం గొలుసు తెంచుకెళ్లారు. సుమారు 44 గ్రాములు ఉంటుంది'. ఇదీ కొంత కాలంగా గుంటూరు నగరంలో పరిస్థితి.

నగరంపాలెం: సుమారు పది రోజుల వ్యవధిలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. బంగారం గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరస ఘటనలతో మహిళలు హడలిపోతున్నారు. గత రెండు నెలలకుపైగా తాళాలు వేసిన ఇళ్లు, మూసేసిన దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడుతున్నారు. అక్కడా.. ఇక్కడా జరిగింది అంటూ వచ్చిన ఫిర్యాదులతో పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఇటువంటి ఘటనలను బాధితులు మరువక ముందే గొలుసు చోరీలు ఎక్కువయ్యాయి.

పోలీస్‌లు ప్రయత్నాలు..

గతంలో జరిగిన దొంగతనాల కేసుల్లో చోరులను గుర్తించేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో జల్లెడ పడుతున్నారు. వేలిముద్రలు, సీసీ టీవీ ఫూటేజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు..

- గత నెల 27న విజయవాడ వాసి ఇమ్మడి ధన లక్ష్మి విజయవాడ- చిలకలూరిపేటకు బయలుదేరగా, గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దిగింది. ఈ క్రమంలో చిలకలూరిపేట బస్ ఎక్కే క్రమంలో వృద్ధురాలి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు గుర్తుతెలియని ఓ వ్యక్తి తెంచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుపై పాతగుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- గతనెల 30న ఎస్‌వీఎస్ కాలనీ రెండో వీధికి చెందిన పొట్టికాశి అన్నపూర్ణమ్మ(84) ఇంటి వెనుక బాత్రూంలోకి వెళ్లింది. ఈ క్రమంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. దీంతో లైట్ స్విచ్ఛాఫ్ చేసి, ఆమె మెడలోని ఆరు సవర్ల బంగారు గొలుసుతో ఉడాయించాడు. దీనిపై పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- ఈనెల ఒకటిన విద్యానగర్ మూడో వీధిలో ఉంటున్న తల్లి, కుమార్తె నడక(వాకింగ్)కు వెళ్లి ఇంటి బాట పట్టారు. ఒంటరిగా వస్తోన్న తల్లీ, కుమార్తెను గుర్తించిన ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి, కుమార్తె మెడలోని రెండు సవర్ల బంగారం తస్కరించారు.

ఎవరూ లేని ఏరియాలే..

ఒంటరి మహిళలు, వృద్ధులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. తొలుత నిర్మానుష్య ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. అవికూడా జన సంచారం లేని పరిసర ప్రాంతాల్లో మకాం వేసి పక్కాగా చోరీకి పాల్పడుతున్నారు. సీసీ కెమెరాల్లేని ఏరియాల్లో కూడా తెగబడుతున్నారు. దీంతో ఒంటరిగా వెళ్లే వారు లేదా ఇద్దరుగా నడిచి వెళ్లే వారిపై విరుచుకుపడుతున్నారు. వాకింగ్‌కు, బజార్‌కు అని బయటకు వచ్చే మహిళలకు దగ్గరగా వెళ్లి వారి మెడ లోని గొలుసులు తెంచుకెళ్తున్నారు. స్కూటీలు, మోటారు సైకిళ్లపై రయ్‌మంటూ వచ్చేయడం, రెప్పపాటులో పనులు ముగించేస్తున్నారు. ముఖాలు కనిపించకుండా ఉండేందుకు మాస్కులు లేదా కర్చీఫ్‌లు ధరించి చోరీలు చేస్తున్నారు. అంతే గాక బైక్ నంబర్లు లేకుండా మరింతగా జాగ్రత్తపడుతున్నారు. ఈ తరహా చోరీలు 25 ఏళ్ల లోపు యువకులే చేస్తున్నారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు సమయంలో చెబుతున్నారు.

మనోధైర్యంతోనే క్యాన్సర్‌పై విజయం

ఆంకాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్ర కుమార్

లక్ష్మీపురం: ఆధునిక వైద్య విధానాలతో పాటు రోగి మనోధైర్యం క్యాన్సర్‌పై విజయంలో కీలకంగా నిలుస్తుందని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.ఫణీంద్ర కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. 'క్యాన్సర్ వ్యాధి- కారణాలు- చికిత్స' అన్న అంశంపై నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలను పొట్టను పెట్టుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనదని వివరించారు. భారత్‌కి క్యాన్సర్ సునామి పొంచి ఉందంటే అతిశయోక్తి కాదన్నారు. సంస్థ సభ్యుల సందేహాలను డాక్టర్ ఫణీంద్ర కుమార్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర కుమార్‌ను సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు టీవీ సాయిరాం సమన్వయం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చల్లా అంజిరెడ్డి, రవిచంద్ర, భావన్నారాయణ ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.ఫణీంద్రకుమార్

సేవా గుణం వాసవీమాత వరం..

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవాసవీ మాత పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టడం వరంగా భావిస్తున్నట్లు శ్రీ వాసవి సేవా సమితి అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు పేర్కొన్నారు. కొత్తపేటలోని ఫ్యాన్సీ మర్చంట్ కళ్యాణ మండపంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 600 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, 50 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 32 ఏళ్ల క్రితం వ్యవస్థాపక అధ్యక్షుడు కోట సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు స్థాపించిన శ్రీ వాసవి సేవా సమితి విద్య, సమాజ హిత కార్యక్రమాల ద్వారా రూ.లక్ష పేద మధ్యతరగతి ప్రజలకు అందించటం వాసవి మాత కటాక్షంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షులు కొత్తూరు వెంకట నరసింహారావు, చౌట ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చుండూరు దామోదర రావు, కార్యదర్శి కాకర్ల హనుమంతరావు, ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు, కార్యదర్శి రంగా రామకృష్ణ, కోశాధికారి అచ్యుత నిరంజన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ సేవా సమితి ప్రతినిధులు



ఏటీ అగ్రహారం సత్యదేవ మందిరంలో చండీ దేవీ అలంకారణలో అమ్మవారు



సంపత్‌నగర్ శ్రీశృంగేరి శంకరమఠంలో అమ్మవారికి మయూర వాహనంపై..



మల్లారెడ్డినగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో లలితాదేవీగా..



మారుతీనగర్ శ్రీ కంచి కామ కోటి పీఠంలో కాళికాదేవీగా..



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానంలో ధనలక్ష్మీదేవిగా..



సీతారాంనగర్‌లో శ్రీసీతారామ స్వామి దేవస్థానంలో..



మల్లికార్జునపేట శివాలయంలో గాయత్రీమాతగా..

గాయత్రీమాతగా అమ్మవారి దర్శనం

నగరంపాలెం: నగరంలో దేవీశరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మరింత రద్దీగా కనిపించాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం వేళల్లో కోలాటం, భగవన్నామ సంకీర్తన, భక్తిగీతాలాపన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి.

విద్యార్థి దశలో కష్టపడితే భవిత బంగారుమయం

జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ రాధిక

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో సుఖాలను వదులుకుంటే భవిత బంగారుమయం అవుతుందని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు విద్యార్థులను సన్నద్ధం కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం సందర్శించారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో 300 మంది విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో రాధిక మాట్లాడుతూ సమయం అందరికీ ఒకే విధంగా ఉంటుందని, దానిని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకున్నప్పుడే విజయాన్ని అందుకోగలమని పేర్కొన్నారు. చేసే పనిని ఇష్టంతో చేయాలని, ఏకాగ్రత ఎంతో ముఖ్యమన్నారు. కంఫర్ట్ జోన్ వదిలిపెట్టి కష్టపడితేనే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరని, పోటీ పరీక్షల్లో విజయ సాధనకు కృషి, పట్టుదలతో సన్నద్ధం కావాలన్నారు. అనంతరం మెంటల్ ఎబిలిటీ టెస్ట్ నిపుణుడు జి.ప్రకాష్, గణిత, వేద గణిత నిపుణుడు ఎస్.ఆదినారాయణ స్పీడ్ మాథ్స్ నిపుణుడు శ్రీనివాస్ విద్యార్థులకు పోటీ పరీక్షకు అవసరమైన విషయాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మానవత సంస్థ కార్యదర్శి కె.సతీష్, డైరెక్టర్లు ఉప్పాల సంవత్సరాలు, ఎస్.సాంబశివరావు, చావా శివాజీ, కోశాధికారి సాయిరాం, మేనేజర్ సాయికిరణ్, అరుణాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ రాధిక

వైభవంగా లక్షమోదక గణపతి హోమం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ ప్రధాన రహదారిలోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెల శుద్ధ చవితి నాడు నిర్వర్తించే లక్షమోదక గణపతి హోమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కోట నాగరాజశర్మ అవధాని వేద మంత్రాలతో తెల్లవారుజాము నుంచి విశేషంగా అభిషేకాలు నిర్వహించగా, అనంతరం హోమశాలలో గణపతి హోమం చేపట్టారు. నవరాత్రులను పురస్కరించుకుని చండీ హోమం విశేషంగా చేశారు. వివిధ ద్రవ్యాలు, పుష్పాలతో శాస్త్రోక్తంగా పూర్ణాహుతిగావించగా, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

నేడు పాలస్తీనా సంఘీభావ దినం



తాడేపల్లిరూరల్ : పాలస్తీనాపై ఇజ్రాయెల జరుపుతున్న దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం జరిగే పాలస్తీనా సంఘీభావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీవీ భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

కంకరగుంట ఫ్లై ఓవర్ వద్ద ఓ వ్యక్తి మృతి

లక్ష్మీపురం: కంకరగుంట ఫ్లై ఓవర్ వద్ద పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కంకరగుంట ప్రాంతానికి చెందిన పచ్చల దేవానంద్(53) ప్లంబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గత రెండు రోజులుగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద చెట్టు కింద మద్యం తాగి కూర్చుని ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు గుర్తించారు. చుట్టు పక్కల వారిని విచారించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేసి మృతదేహన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రి పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పచ్చల దేవానంద్

కొత్త లేబర్ చట్టాలను రద్దు చేయాలి

సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

లక్ష్మీపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా ఏర్పాటు చేసిన 4 లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక ఒకటో డివిజన్ మణిపురం ప్రాంతంలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర జనాభాకు తగినట్లుగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో పది పంచాయతీలు విలీనం చేసినప్పటికీ పారిశుద్ధ్య కార్మికులను పెంచలేదని, పర్మనెంట్ కార్మికులు రిటైర్డ్ అయిన వారి స్థానంలో ఖాళీలు అట్లానే ఉంటున్నాయని పేర్కొన్నారు. సమ్మె కాలంలో పనిచేసిన కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని, వరదల వల్ల నష్టపోయిన విజయవాడ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుటకు పనిచేసిన కార్మికులందరికీ అదనపు జీవితాలు చెల్లించాలని అన్నారు సమావేశంలో బుజ్జి, ఎసురత్నం, ఏరమ్మ, శివ జాన్ నాగరాజు, సామ్రాజ్యం, సుదర్శనం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

ఇసుక లారీ స్వాధీనం

తాడికొండ: తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని, వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం తెల్లవారుజామున ఉద్దండరాయునిపాలెం నుంచి ఇసుక లోడ్ చేసుకొని వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి 15 టన్నుల ఇసుక, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కళాకారులకు తెనాలిలో 'రంగస్థల దసరా'

'వీణా అవార్డ్స్' నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణలో సాయిమాధవ్ బుర్రా

తెనాలి: రాష్ట్రంలోని కళారంగంలోని వారికి తెనాలిలో రంగస్థల దసరా ఆరంభమవుతోందని కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్- విజయవాడతో కలిసి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 7–12 తేదీల్లో జరగనున్న వీణా నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. జాతీయ స్థాయి చతుర్థ సాంఘిక పద్య నాటక, సాంఘిక నాటక, నాటికల పోటీల వివరాలను తెలియజేశారు. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి ఉత్సవాల సదస్సు, వారి పేరిట ప్రస్తుత రంగస్థల నటులు/ రచయితలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మధ్యలో శ్రీదుర్గాభవాని నాట్యమండలిచే శ్రీకృష్ణరాయబారంలో నాటక సన్నివేశ ప్రదర్శన ఉందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సమకాలీన సాంఘిక పద్యనాటకం, మధ్యాహ్నం 2 గంటలకు సాంఘికనాటకం, సాయంత్రం రెండేసి నాటికల చొప్పున ప్రదర్శనలు ఉంటాయన్నారు. తొలిరోజున పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్‌ఎన్ మూర్తికి ప్రదానం చేస్తారు. ముగింపురోజైన 12న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని రాష్ట్రంలోని పేరెన్నికగన్న రంగస్థల నటుడు యడ్ల గోపాలరావుకు ప్రదానం చేస్తామని వివరించారు. మళ్లీ కొత్తగా తీసుకొస్తున్న సాంఘిక పద్యనాటకాలతో సహా ఆయా రోజుల్లో ప్రదర్శనలను ప్రజలు ఆదరించాలని డాక్టర్ సాయిమాధవ్ కోరారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, గోగినేని కేశవరావు, అయినాల మల్లేశ్వరరావు, అలపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరించిన సాయిమాధవ్ బుర్రా

దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన జగ్జీవన్‌రామ్

తెనాలిరూరల్: దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన ఏకైక వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అన్నారు. పట్టణ చినరావురుకు చెందిన బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణమాదిగ మాట్లాడుతూ 1934 నుంచి 1986 వరకు 52 ఏళ్ల పాటు దేశానికి జగ్జవన్‌రామ్ ఎన్నో సేవలందించారని, కేంద్రంలో సుదీర్ఘకాలం కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాణం, ముసాయిదా తయారీలో అన్ని సబ్ కమిటీల్లో జగ్జీవన్‌రామ్ కీలక సభ్యుడిగా ఉన్నారని, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జగ్జీవన్‌రామ్ చరిత్రను కొందరు వక్రీకరించారని, అసత్యాలను ప్రచారం చేశారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ చరిత్రను ఉన్నది ఉన్నట్టు తెలిపే బాధ్యత ఎమ్మార్పీఎస్‌పై ఉందని చెప్పారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైందని అమ్మవంటిదని తెలిపారు. దీని వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణంగా మూలాలతో సహా వ్యాధులు నయం చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 120 పడకలతో ఆయుర్వేద వైద్యశాలను గుంటూరు నగరంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో నాడీ పరీక్షలు చేసి 120 మందికి రూ.90 వేల విలువ చేసే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కశ్యప్, డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య, మల్లేశ్వరి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com